సాక్షి విజయనగరం

గురువారం । 6 । ఏప్రిల్ । 2023




నేలకు నవ వసంతం

భూసారంపైనే పంటదిగుబడి ఆధారపడి ఉంటుంది. అందుకే ... నవధాన్యాలతో నేలను సారవంతం చేయాలని వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. - 8లో



ఆక్రమణలో డీసీఎంఎస్ స్థలం

పాలకొండ నగర పంచాయతీ పరిధి 9వ వార్డులో ఉన్న డీసీఎంఎస్ స్థలం ఆక్రమణలకు గురైంది. కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. - 8లో



ఆహ్లాదం..

ఓ వైపు పూలసోయగాలు.. మరోవైపు ఆకర్షించే కార్టూన్లు.. కొత్తవలస మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణించేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు (సా॥)	శుక్ర (ఉ॥)
6:16	4:25

న్యూస్‌రీల్

నేడు మంత్రి బొత్స రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. నగరంలోని తన నివాసానికి బుధవారం చేరుకున్నారు. గురువారం ఉదయం 9.45 గంటలకు ద్వారపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11.30 గంటలకు ఐస్‌ఫ్యాక్టరీ కూడలి వద్ద దండి సత్యాగ్రహం సన్నివేశాల విగ్రహాలను ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ వెళ్లి విజయవాడ చేరుకుంటారు.

బాధితుల సమస్యలు వినాలి



దేశపాత్రునిపాలెం గ్రామ యువతకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

కొత్తవలస: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను సిబ్బంది సావధానంగా విని న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక సూచించారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. క్రైమ్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీస్‌లతో మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దేశపాత్రునిపాలెం గ్రామ యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎస్‌ఐ బొడ్డు దేవికి సూచించారు. కార్యక్రమంలో సీఐ ఎస్.బాలసూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఉపకరణాలు



ఉపకరణాలను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి భవిత కేంద్రంలోని 21 మంది దివ్యాంగులైన విద్యార్థినీ, విద్యార్థులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. నాలుగు జతల వినికిడి యంత్రాలను, వీల్‌చైర్స్-7, సీపీ చైర్స్-6, ట్రైసైకిళ్లు-2, రొలేటర్స్-2, క్రచెస్-1 జతను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రమీల, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఐఈఆర్‌పీ రమణారావు, సుమలత పాల్గొన్నారు.


వీడని గజరాజుల భయం



వెంకటరాజపురంలో అరటితోటలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పరిసర ప్రాంతాల ప్రజలను గజరాజుల భయం వీడడంలేదు. కర్బూజా తోటలో నాలుగు రోజుల నుంచి సంచరిస్తూ పంటను నాశనం చేస్తున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇప్పలపోలమ్మా.. కాపాడమ్మా...



ఇప్పలపోలమ్మ తల్లి ఘటాలను పుట్టవద్దకు తీసుకెళ్తున్న భక్తులు

జియ్యమ్మవలస: వెంకటరాజపురం, ఎం.హరిపురం గ్రామాల్లో ఇప్పలపోలమ్మ, చినపోలమ్మ అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. మూడురోజుల పాటు జరిగే పండగలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్లకు పసుపుకుంకుమలు సమర్పించారు. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఘటాలను తిరువీధి జరిపారు.

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ సేవలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఉన్న 104 కొత్త వాహనాలు

- నేటి నుంచి పూర్తిస్థాయిలో అమలు
- జిల్లాలో ట్రయల్‌రన్ విజయవంతం
- నేటి నుంచి అన్ని పీహెచ్‌సీల పరిధిలో అమలు
- ఇప్పటివరకు జిల్లాలో 27 వాహనాలతో సేవలు
- కొత్తగా మరో 19 వాహనాల కేటాయింపు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో విజయవంతమైంది. వైద్యులు, సిబ్బంది ప్రతినెలా 104 వాహనాలపై గ్రామాలకు వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలో వచ్చేవారికి వైద్యపరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తున్నారు. వివిధ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి జిల్లా కేంద్రాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీనివల్ల ప్రాథమిక దశలోనే వ్యాధులు నయంచేసుకునే వెసులబాటు కలుగుతోంది. అవసరమైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. మరోవైపు మంచానపడి ఉన్న వృద్ధులతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. నిన్నటివరకు కొన్ని పీహెచ్‌సీల పరిధిలో అమలయ్యే ఫ్యామిలీడాక్టర్ సేవలు గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పీహెచ్‌సీల పరిధిలోని ప్రజలకు అందనున్నాయి. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఐదు నెలల్లో 2,14,097 మందికి...



గత ఏడాది అక్టోబర్ 21వ తేదీన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు 2,14,097 మందికి వైద్య బృందాలు సేవలందించాయి. వీరిలో గర్భిణులు 13,861 మంది, బాలింతలు 5,402 మంది, జ్వరపీడితులు 3,567 మంది, పిల్లలు 7,873 మంది ఉన్నారు. అలాగే, బీపీ రోగులు 58,456 మంది, సుగర్ వ్యాధిగ్రస్తులు 34,335 మంది వైద్య సేవలు పొందారు. 1,48,367 మందికి వివిధ రకాల రక్తపరీక్షలు చేశారు. 20,238 మంది ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. 5,639 పాఠశాలల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

46 వాహనాలతో సేవలు

జిల్లాలో 104 వాహనాలు 27 ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందేవి. తాజాగా ప్రభుత్వం మరో 19 వాహనాలను కేటాయించింది. మొత్తంగా 46 వాహనాలతో వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు.

అన్ని సేవలు ఒకేచోట

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో ఉన్న విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు, హెల్త్‌అసిస్టెంట్, సీహెచ్‌ఓ, హెల్త్ సూపర్ వైజర్లు (మేల్, ఫిమేల్)లతో కూడిన వైద్య బృందం వైద్య శిబిరం నిర్వహిస్తుంది. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ లేని చోట సచివాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరానికి వచ్చిన రోగులను వైద్యులు తనిఖీ చేస్తారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ బీపీ, సుగర్ పరీక్షలు చేస్తారు. 104 డేటా ఎంట్రీ ఆపరేటర్ శిబిరానికి వచ్చిన రోగులకు అందించిన చికిత్స వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. గర్భిణులకు బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేస్తారు. అక్కడ పిల్లల ఎత్తు, బరువు తూసి, పిల్లలు అందరికీ వైద్య పరీక్షలు చేస్తారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు అందజేస్తారు. ఒంటి గంటనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భోజన విరామ సమయం ఉంటుంది. 2 గంటల తర్వాత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత మంచానికే పరిమితం అయిన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు, చికిత్స పొందిన వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య వివరాలపై ఆరా తీస్తారు. ఆరోగ్య జాగ్రత్తలు చెబుతారు. సమస్యలుంటే వైద్యం అందిస్తారు.

ప్రజలకు వైద్యభరోసా

ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఊరిలోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లా వ్యాప్తంగా సేవలు అందనున్నాయి. 104 వాహనాలను పూర్తిస్థాయిలో సమకూర్చింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పిస్తోంది.

– డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, డీఎంహెచ్ఓ

ప్రజల్లోకి సంక్షేమపాలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- రేపటి నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ
- ప్రజలతో మమేకం కావడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశం
- జిల్లాలోని 7 అసెంబ్లీస్థానాల్లోనూ ఒకేసారి కార్యక్రమం ప్రారంభం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనువాసరావు

చీపురుపల్లిరూరల్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా చేపట్టిన ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలనను ఇంటింటికీ వెళ్లి వివరిస్తాం.. 2024లో జరగనున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తాం.. ప్రజల అభిప్రాయాలను సేకరించి.. సమస్యలను పరిష్కరిస్తామని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపడతామని స్పష్టంచేశారు. చీపురుపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకం కావడమే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని 15వేల సచివాలయాల్లో 20వేల గృహసారథులతో ఒకేసారి పెద్దఎత్తున ప్రారంభమయ్యే కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసి పాల్గొంటారన్నారు. అధికారం కోసం కాకుండా రాబోయే రోజుల్లో రాష్ట్రాభివృద్ధి, తరాల భవిష్యత్, విద్యార్థుల భవిష్యత్ కోసం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోనికి రావాల్సిన చారిత్రాత్మక అవసరాన్ని వివరిస్తామని చెప్పారు. ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోనికి వచ్చిన నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98.5శాతం అమలు చేసి చూపించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ఉండే నమ్మకంలో భాగంగా ప్రజామద్దతు పుస్తకంతో ఈ మూడు వ్యవస్థలు ప్రతీ కుటుంబాన్ని కలుస్తాయని, ఒక్కో కుటుంబంతో కనీసం 15 నిమిషాలు పాటు గడిపి ప్రభుత్వం చేస్తున్న ప్రజారంజక పాలనను వివరిస్తాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన, అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలియజేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్యగల తేడాను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో సుమారు 6లక్షల శాశ్వత ఉద్యోగాలను భర్తీచేసిందన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు జరిగినట్టు వెల్లడించారు. దీనివల్ల భవిష్యత్‌లో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా అధికారం కోసం, నిధుల దుర్వినియోగం కోసం కాకుండా ప్రజలకు అన్ని సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చామన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్తామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పంపించిన ప్రతినిధిగా ఇంటింటికీ వెళ్లి రాబోయే రాష్ట్ర, మన పిల్లల భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తామని తెలిపారు. ఈ మధ్య కాలంలో కొన్ని మీడియా చానల్స్ ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రజల్లో అనేక రకాలుగా భ్రమలు కల్పించి, వాస్తవాలను దూరం చేసేలా, దోచుకోవడం, దాచుకోవడమే పరమావధిగా కొన్ని రాజకీయ పార్టీలతో కలిసి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని గృహసారథులు, పార్టీ కన్వీనర్లకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాల తీరును వివరించాలని వలంటీర్లకు తెలియజేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, నాయకులు ఇప్పిలి అనంతం, దన్నాన జనార్దన్, పతివాడ రాజారావు, అధికార్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నిర్వాకం

చిత్రంలో మురుగునీటితో కనిపిస్తున్న వీధి ఎల్.కోటమండలం కిత్తన్నపేట గ్రామంలోది. ఆ నీరంతా సర్పంచ్ దుక్క వెంకటరావు ఇంటి నుంచి వస్తున్న వాడుకనీరు. కాలువలోకి వెళ్లాల్సిన నీటిని ఇలా రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. గ్రామానికి ఆదర్శంగా ఉంటారని, సమస్యలు పరిష్కరిస్తారని ఎన్నుకుంటే.. తీరా.. ఆయనే వాడుకనీరంతా రోడ్డుపైకి విడిచిపెట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ గ్రామస్తులు వాపోతున్నారు. కనీసం ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్న జ్ఞానం కూడా లేదని విమర్శిస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరుతున్నారు.



– ఎల్.కోట

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఏపీ గిరిజన గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి, 6నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూ గురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాతపరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామ ని పేర్కొన్నారు.

ఖాళీలు ఇలా...

కోనవలస గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, 6లో 4, 7వ తరగతిలో 2 ఖాళీలు, కురుపాం గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, 6లో 11, 7లో 1, 8లో 4, 9వ తరగతిలో 3 సీట్లు, భద్రగిరి గురుకులంలో 5వ తరగతిలో 80, 6లో 2, 7లో 4, 8లో 1, 9వ తరగతిలో 2, కొమరాడ గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు ఖాళీలు ఉన్నాయి. ఐదో తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

తెరచుకోని రైల్వే గేటు



మొరాయించిన రైల్వే గేటుతో నిలిచిన రాకపోకలు

గజపతినగరం: గజపతినగరం–పురిటిపెంట రైల్వే గేటు లాక్ తెరచుకోకపోవడంతో ప్రయాణికులు ఓ అరగంట సమయం ఇబ్బందిపడ్డారు. రైల్వే ట్రాక్ మీదుగా గూడ్స్ రైలు రావడంతో గేట్‌మన్ బుధవారం సాయంత్రం గేటు వేశాడు. రైలు వెళ్లిపోయిన తరువాత గేటు తెరిచేందుకు ప్రయత్నించగా లాక్ ఓపెన్‌కాలేదు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ప్రయత్నించడంతో లాక్ తెరచుకుంది. అనంతరం సమతా ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వినూత్న ఆవిష్కరణలతో ప్రగతి



'హ్యాకథాన్-2023' టెక్నికల్ సింపోజియంను ప్రారంభించిన జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య
- సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'హ్యాక్‌థాన్-2023' సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: వినూత్న ఆవిష్కరణలతో సామాజిక ప్రగతి సాధ్యమని, మానవ జీవనం మెరుగైన స్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడే ఆవిష్కరణలు జరగాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం స్మార్ట్ విజయనగరం అంశంగా 'హ్యాక్‌థాన్-2023' పేరుతో నాలుగురోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం అండ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టు పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య విద్యార్థి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అదే లక్ష్యంగా డిగ్రీ విద్యలో ఇంటెర్న్‌షిప్ విధానాన్ని అమలులోకి తెచ్చి ఏడాదిలో దాదాపు 93 శాతం మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించారన్నారు. ఇంతవరకు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని అమలు చేయలేదన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి పాల్గొనే విద్యార్థుల మధ్య వినూత్న ఆలోచనలు, చురుకైన సృజనాత్మక చర్చలు, సమకాలీన ఆలోచనలు తీసుకురావాలన్నదే సదస్సు ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బ్రెయిన్ ఓ విజన్ సీఈఓ గణేష్‌నాగ్, స్కీమా టెక్ సీఈఓ సుంకరనాయుడు, కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, వివిధ విభాగాల అధిపతులు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో పయనిద్దాం

- బాబూజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:


మహనీయుల బాటలో పయనిద్దామని, నేటి తరం యువత, విద్యార్థులు మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని, సమాజానికి సేవచేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రఘురాజు డీఆర్వో ఎం.గణపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవిత పాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చదువు అనే మార్గాన్ని అనుసరించి ఆయన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అరుపులు, కేకలతో ఏమీ సాధించలేమన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నా... సామాజిక చైతన్యం తీసుకురావాలన్నా చదువే అసలైన ఆయుధమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, మెప్మా పీడీ సుధాకర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రత్నం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, ఎమ్మెల్సీ రఘురాజు

సంఘ సంస్కర్త

విజయనగరం గంటస్తంభం: సమాజంలో అనేక సంఘ సంస్కరణలు తీసుకొచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక వివక్షకు వ్యతిరేకంగా యువతను కూడగట్టి పోరాటం చేశారన్నారు. బలహీన వర్గాల నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అతి చిన్న వయసులోనే భారత మొట్టమొదట కార్మిక మంత్రి పదవి చేపట్టిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎన్.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, గజపతినగరం జెడ్పీటీసీ గారతౌడు, డీపీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, తదితరులు

క్లుప్తంగా

ఉరుములు, పిడుగులతో భారీ వర్షం



నేరడిలో కురుస్తున్న భారీ వర్షం

భామిని: మండలంలో పలుచోట్ల బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఈ వర్షం తోడవడంతో పొలాల్లో నీరు చేరింది. ఇప్పటికే దెబ్బతిన్న పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ వర్షంతో ఆరుతడి పంటలతో పాటు రబీ పంటలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

విజయనగరం ఫూల్‌బాగ్: వేసవిలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని (ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్) ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము అధ్యక్షతన స్థానిక ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో బుధవారం సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెరకు ట్రాక్టర్ బోల్తా



రాజాం రహదారిలో బోల్తా పడిన చెరకు ట్రాక్టర్

పాలకొండ రూరల్: పాలకొండ- రాజాం రహదారిలో స్థానిక సన్‌మ్యాక్స్ థియేటర్ వద్ద బుధవారం రాత్రి చెరకు లోడుతో రాజాం వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ క్రమంలో రాజాం, విశాఖ వైపు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆక్రమణలో డీసీఎంఎస్ స్థలం



డీసీఎంఎస్ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు అందడంతో డీటీ బుచ్చయ్య స్థలం వద్దకు బుధవారం వెళ్లి పరిశీలించారు. నిర్మాణాలు తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ స్థలం రైతు బజారు నిర్మాణం కోసం కేటాయించారని వివరించారు. రెండు రోజుల్లోగా అక్రమ కట్టడాలను తొలగించాలని లేకుంటే తామే వాటిని తొలగిస్తామని ఆక్రమణదారులకు హెచ్చరించారు.

తల్లీబిడ్డపై నలుగురు దాడి

విజయనగరం క్రైమ్: కొడుకుని తిడితే తల్లి అడిగిందని నలుగురు వ్యక్తులు తల్లీకొడుకులిద్దరినీ చితకబాదేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొత్త అగ్రహారానికి చెందిన ఎస్.ఆదిలక్ష్మి అనే మహిళ తన కుమారుడ్ని ఎందుకు కొట్టారని శాంతినగర్ వెళ్లి కొందరు వ్యక్తులను ప్రశ్నించింది. దీంతో మాటామాట పెరగడంతో తల్లీకొడుకులపై నలుగురు వ్యక్తులు దాడి చేసి చితకబాదారు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	56,150-00
బంగారం(22కే. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

నేలకు నవ వసంతం

భూసారం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తల తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయం వైపు రైతాంగం దృష్టి మళ్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఆశించిన ఫలితాలు సాధిస్తున్నారు.

- నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతం
- రసాయనిక ఎరువులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళిక
- జిల్లాలో లక్షా 5 వేల 272 ఎకరాల్లో సాగు లక్ష్యం
- పంటతో బహుళ ప్రయోజనాలు



నవధాన్యాల విత్తనాలు

సీతంపేట: భూసారం పెంచడానికి, నేల తల్లి ఆరోగ్యం కాపాడి జీవం పోయడానికి నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ దిశగా రైతులను చైతన్యం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రసాయనిక ఎరువులు వాడకంతో భూముల సారం కోల్పోయాయి. ఈ పరిస్థితుల్లో రేపటి తరానికి మంచి భూములను అందించాలన్న సదాశయంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది. గ్రామ, గ్రామాన రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

లక్షా 5 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక

ఈ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ అనంతరం ఖాళీగా ఉన్న పంట చేలల్లో పచ్చి రొట్ట బదులు నవ ధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. 2023 - 24 సంవత్సరంలో జిల్లాలో 15 మండలాల్లో 50,782 మంది రైతులు లక్షా 5 వేల 272 ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా మండలాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే రైతుల నుంచి ఆమోదం తీసుకుని విత్తన గుళికలు తయారు చేసి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవధాన్యాలతో పాటు 32 రకాల విత్తనాలు వీటిలో ధాన్యం, పప్పు, నూనె, పచ్చిరొట్ట సుగంధ ద్రవాలు కలిసి ఉంటాయి. మొక్కజొన్న, జొన్న, మినుములు, పెసలు, ఉలవలు, చోడి, జిలుగు, జనుము, గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీర, ఆనప, ఉుదలు, కొర్రలు తదితర విత్తనాలు నవధాన్యాలుగా పంట పొలాల్లో చల్లుతారు. 12 కిలోల విత్తన గుళికలను బంక మట్టితో కలిపి వాటి పరిమాణాన్ని రెండున్నర రెట్లుగా పెంచుతారు.



నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

దీనికి ఘన జీవామృతాన్ని జోడించి రైతులకు అందజేస్తారు. విత్తన గుళికలు తయారీతో ఆ విత్తనాలను పక్షులు తినే వీలు లేకుండా ఉంటుంది. చల్లిన ప్రతీ గింజ మొలకెత్తుతాయి.

పశువులకు మేతగా...

40 నుంచి 45 రోజుల పాటు ఏపుగా ఎదిగే నవధాన్యాలపై పంట పశువులకు మేతగా రైతులు కోసుకుని లబ్ధి పొందుతారు. బలవర్ధక పౌష్టికాహారం పశువులకు అందుతుంది. దీంతో పాడి లాభసాటిగా, పశువులు ఆరోగ్యంగా ఉండటంతో రైతులకు రెండు రకాలుగా మేలు జరుగుతుంది. భూమిలోకి వెళ్లిన వేళ్లు రైతులు కోసివేయగా మిగిలిన నవధాన్యాల దుబ్బులు భూమిలో ట్రాక్టర్‌లతో కలియ దున్నుతారు. దీంతో భూమి గుల్లబారి, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి సూక్ష్మపోషకాలు భూమిలో వృద్ధి చెంది ఖరీఫ్ పంటకు జవసత్వాలు రెట్టింపవుతాయి.

బీజామృతం తయారీ ఇలా...

దేశీ ఆవుపేడను పలచటి గుడ్డలో మూటకట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టెలో 12 గంటలు ఉంచాలి. ఒక లీటరు నీటిని వేరే పాత్రలో తీసుకుని 50 గ్రాముల సున్నం కలిపి రాత్రంతా ఉంచి ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేతితో పిండి రసాన్ని నీటి తొట్టెలో కలపాలి. పుట్ట మందును పేడ నీరు ఉన్న తొట్టెలో వేసి కర్రతో తిప్పాలి. 12 గంటల పాటు నిల్వ ఉంచి మరునాడు విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టి నాటితే ఏ రకమైన చీడపీడలు రాకుండా విత్తనాలు మొలకెత్తుతాయి. వీటిపై ప్రకృతి వ్యవసాయం అధికారులు రైతులను చైతన్యం చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామసభలు ఏర్పాటు చేసి వీవో, ఎస్‌హెచ్‌జీలు, ఆర్‌బీకేల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తొలకరి వర్షాలకు రైతులు నవధాన్య విత్తన గుళికలు పంట పొలాల్లో చల్లడం ద్వారా పచ్చిరొట్ట తయారౌతుంది. 40 రోజుల్లో మొలకెత్తిన పంట ఏపుగా పెరిగి, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. అలాగే భూమి సారవంతమౌతుంది.

– పి.షణ్ముకరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

ఎరువుల వినియోగం తగ్గుతుంది



నవ ధాన్యాలు వేయడం వలన ఎరువుల వాడకం తగ్గుతుంది. గత సంవత్సరం మంచి ఫలితాలు వచ్చాయి. మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఘన, ద్రవ జీవామృతాలు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

– ధనుంజయరావు, అడిషనల్ డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి



శ్రీహరి మృతదేహం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బీరుపాడు పంచాయతీ దబ్బలగూడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పువ్వల శ్రీహరి(35) అనే గిరిజనుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నెల్లికిక్కువ పంచాయతీ వాడపుట్టి గ్రామానికి చెందిన పలువురు ఒడిశా రాష్ట్రం రాయగడలోని మజ్జిగౌరీ దేవిని దర్శించుకునేందుకు బుధవారం పికప్ వాహనంలో బయల్దేరారు. దబ్బలగూడ గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న లొతైన ప్రదేశంలో బొల్తా పడింది. ఈ ఘటనలో శ్రీహరి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను వైద్యం నిమిత్తం రాయగడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్విన్‌పేట పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సాంపలమ్మ, ఇరువురు పిల్లలున్నారు.



మండల ఆనంద్ (ఫైల్)

జారిపడి వ్యక్తి..

మెంటాడ: మండల కేంద్రంలోని మండల వీధికి చెందిన మండల ఆనంద్(49) మంగళవారం రాత్రి తన ఇంటి మేడపైకి వెళ్తూ జారిపడి మృతి చెందాడని ఆంద్ర ఎస్ఐ సిద్దార్థ బుధవారం తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మేడ పైనుండి జారి పడిన వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

ఆటో - బైక్ ఢీకొని ఒకరి దుర్మరణం

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి - సుబద్రాపురం ప్రధాన రహదారిలో గచ్చలవలస గ్రామానికి వెళ్లే మార్గంలో ఆటో - బైకు ఢీకొన్న ప్రమాదంలో రణస్థలం మండలం బంటుపల్లి గ్రామానికి చెందిన జాడ బంగారురాయుడు(72) మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. బంగారురాయుడు తన కుమారుడు సూర్యనారాయణతో కలిసి ఆస్పత్రికి వెళ్లి మళ్లీ ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గత్సలవలస మార్గంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన బంగారురాయుడుని చీపురుపల్లి ప్రభుత్వాసపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంగారురాయుడు మృతదేహం

ప్రమాదవశాత్తు ఇండియన్ నేవీ ఉద్యోగి మృతి

చీపురుపల్లి రూరల్: ఇండియన్ నేవీలో విధులు నిర్వర్తిస్తున్న చీపురుపల్లి మండలం పర్ల గ్రామానికి చెందిన చందక గోవింద్(30) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ మేరకు ఇండియన్ నేవీ అధికారుల నుంచి కుటుంబీకులకు సమాచారం అందింది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపిన వివరాలు.. మృతుడు గోవింద్ విశాఖపట్టణం నుంచి కొల్‌కత్తాలో పారాచ్యుట్ శిక్షణ నిమిత్తం వెళ్లగా అక్కడ జరిగిన సంఘటనలో మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో ఏడాది క్రితం తండ్రి మరణించగా ప్రభుత్వ ఉద్యోగంలో కొలువు సాధించిన గోవింద్ కుటుంబ బాధ్యతలను మోస్తున్నాడు. గోవింద్ మృతితో తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదిస్తుంది. మృతుడు గోవింద్‌కు ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. గోవింద్ మృతితో గ్రామంలో విషాదం అలముకొంది. ప్రస్తుతానికి మృతదేహం కొల్‌కత్తాలో ఉందని గురువారం నాటికి మృతదేహం గ్రామానికి చేరుకోవచ్చునని గ్రామస్తులు తెలిపారు.



గోవింద్ (ఫైల్)

ఆహ్లాదం..

కొత్తవలస మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచిపెడుతోంది. ఓ పక్క పూల సోయగంతో మరో వైపు రైల్వేస్టేషన్ గోడలపై ఆలోచింపజేసే చిత్రాలతో మది పులకింపజేస్తోంది. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పూలచెట్లు ఏపుగా పెరిగి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. అమృతభారత్ రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా సంబంధిత గోడలపై సందేశాత్మకమైన, ఆదర్శనీయమైన కళాఖండాలు రూపుదిద్దుకోవడంతో మార్గమంతా కలర్‌ఫుల్‌గా మారింది. రైల్వే గోడలపై గ్రామీణ వ్యవసాయ సాంప్రదాయాలు, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో యువత పాత్ర, మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ చూడచక్కని పెయింట్‌లతో తీర్చిదిద్దారు. – కొత్తవలస





పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలో రాకోడు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.37,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ బి.గణేష్ బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

విజయనగరం క్రైమ్: మండల పరిధిలో సుంకరపేట జంక్షన్ వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ వెంకటరాజును అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ బి.గణేష్ బుధవారం తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని విజయనగరం నుంచి విశాఖ వైపు తరలిస్తుండగా సుంకరిపేట వద్ద నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు.

బ్యాంకు దోపిడీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైమ్: బ్యాంకు దోపిడికి ప్రయత్నించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక దాసన్నపేట ఎస్‌బీఐ బజార్ రోడ్డు బ్రాంచ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మార్చి 31న బ్యాంక్ షట్టర్ పగలగొట్టి లోపలికి ప్రవేశించి లాకర్‌ను తెరించేందుకు ప్రయత్నించి విఫలమై వెనుదిరిగారు. మరుసటి రోజు గుర్తించిన ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నేరంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీటీవీ ఫుటేజ్, క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలు సేకరించింది. జామి మండలం అన్నంరాజుపేట గ్రామానికి చెందిన కంటుభుక్త మధు అనే పాత నేరస్తుడిగా గుర్తించారు. ప్రస్తుతం విశాఖలో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐకి వచ్చిన కచ్చితమైన సమాచారంతో సిబ్బందితో కలిసి దాసన్నపేట జంక్షన్ వద్ద నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఎస్‌బీఐ బ్రాంచ్‌తో పాటూ కొత్తవలస ఏటీఎం కూడా చోరీకి ప్రయత్నం చేసి విఫలమైనట్లు, పెందుర్తి పోలీసుస్టేషన్‌లో మూడు, ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు తనపై ఉన్నట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ (వెనుక ముసుగులో నిందితుడు)

రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: కన్నకొడుకు పెడుతున్న హింసను తట్టుకోలేక రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి బుధవారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వారందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బొగ్గులదిబ్బకు చెందిన మామిడి సత్యం (70) అనే రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కుమారుడు నాగు నిత్యం తప్ప తాగి, తండ్రిని హింస పెడుతూ, పెన్షన్ డబ్బులు తీసుకుని కొట్టడం చేస్తుండేవాడు. ఈ క్రమంలో మూడో తేదీన పెన్షన్ డబ్బులు తీసుకుని వచ్చిన సత్యం వద్ద నుంచి డబ్బులు లాక్కొని చితక్కొట్టడంతో అతను మనస్తాపం చెంది ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాలు వెతికినప్పటికీ కనిపించలేదు. దీంతో మంగళవారం సమీపంలో ఉన్న బావిలో శవమై తేలాడు. స్థానికులు, కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

పెళ్లి కాలేదని యువకుడు...

విజయనగరం క్రైమ్: వ్యసనాలకు బానిసై, తనకిక పెళ్లి కాదని ఓ యువకుడు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గాజులరేగ శాంతినగర్‌కి చెందిన మల్లికార్జునరావు (29) గత కొంతకాలంగా వ్యసనాలకు బానిసయ్యాడు. సరైన ఉద్యోగం లేకపోవడం, ఆర్థిక పరిస్థితి బాగాలేక, తనకిక పెళ్లికాదని నిశ్చయించుకుని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

ఆర్పీ అక్రమాలపై కేసు నమోదు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన ఆర్పీ శారదాంబ అక్రమాలపై బుధవారం కేసు నమోదు చేశామని సంతకవిటి ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. మున్సిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో రిసోర్స్‌పర్సన్ (ఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్న శారదాంబ తన పరిధిలోని గ్రూపు సభ్యుల డమ్మీ ఫొటోలతో నగదు వాడుకున్నట్లు మెప్మా అధికారులు ఫిర్యాదు చేశారని అన్నారు. ఆర్పీ గత ఏడాది సెప్టెంబర్ 21న శివజ్యోతి గ్రూపు సభ్యులకు తెలియకుండా సంఘం తీర్మాన పుస్తకంపై వారి సంతకాలతో ఆ గ్రూపు సభ్యుల డమ్మీ ఫొటోలతో రూ. 5.36లక్షలు వాడుకున్నట్లు గుర్తించారని అన్నారు. ఈ ఘటనపై ఆ గ్రూపు సభ్యులు సంబంధిత బ్యాంకు అధికారులను నిలదీశారు. విషయం తెలుసుకున్న మెప్మా అధికారులు ఆర్పీని కార్యాలయానికి ఈ ఏడాది జనవరి 30న పిలిపించినప్పటికీ డమ్మీ సభ్యులతో హాజరయ్యారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు. తరువాత ఆర్పీ ఆ మొత్తాన్ని బ్యాంకుకు రెండు విడతలుగా జమ చేశారని అన్నారు. అనంతరం ఫిబ్రవరి 6న మళ్లీ సంఘ సభ్యులచే మీటింగ్ ఏర్పాటు చేసినప్పటికీ ఆర్పీ రాలేదని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయడంతో గ్రామంలోని అంబేడ్కర్, జనజ్యోతి, చైతన్య యువశక్తి, ఇందిర, నవోదయ, శివపార్వతి, శివజ్యోతి, శ్రీరామ, శ్రీ సాయిబాబా, శ్రీశక్తి, రాజీవ్ స్వయం సహాయ సంఘాల సభ్యులను విచారించారని అన్నారు. ఈ సంఘాలలోని పుస్తకాలలో దురుద్దేశ పూర్వకంగా దొంగ సంతకాలు చేసి రూ. 13,18,142లతో పాటు సిరిసంపద పరపతి మహిళా సమాఖ్య పరితి సంఘం పేరున రూ. 6,27,160లు సభ్యులకు తెలియకుండా బ్యాంకు నుంచి మొత్తం రూ.19,45,302లు తీసుకుని ఆమె కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. సంబంధిత ఆర్పీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెప్మా అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

తుప్పల్లోకి దూసుకుపోయిన లారీ



అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో తుప్పల్లోకి దూసుకుపోయిన లారీ

కొత్తవలస : మండలంలోని కొత్తవలస - విజయనగరం రోడ్డులో అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీ తుప్పల్లోకి దూసుకుపోయింది. స్థానికులు అందించిన వివరాలు.. విశాఖపట్నం నుంచి నూతనంగా నిర్మిస్తున్న రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి తెల్లబూడిద లోడ్‌తో చిన్నిపాలెం సమీపంలోకి వెళ్తుండగా అర్ధన్నపాలెం సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకుపోయింది. డ్రైవర్ నిద్రమత్తులో వుండడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు వారు తెలిపారు.